# నిలవచెయ్యడం

నేను యింటర్ చదువుతున్న రోజులలో మానాన్నగారు, "ఏనెల కానెల అకవుంట్ వ్రాస్తూవుండు," అని నొక్కినొక్కి చెప్పేవారు. నాఖర్చులకి ఎంత కావలసివస్తుందో అంతాలెఖ్ఖచూసి ఏనెలకానెల వారు పంపుతున్నప్పుడు అకవుంట్ వ్రాయవలసిన అవసరమేమిటో ఎంతదీర్ఘంగా ఆలోచించినా నాకు బోధపడేదేకాదు. ఒకబహుళ ఏకాదశిరోజున నాకూ, మానాన్నగారికీ ఈ విషయమై చిన్నవివాదం కూడాజరిగింది.

"ఎప్పటిఖర్చుఅప్పుడు నోట్ చేసుకొని అకవుంట్ వ్రాసుకోవడం మంచి అలవాటు," అన్నారాయన.

"వ్రాయకపోవడం చెడ్డఅలవాటా?"

"అవును. అకవుంట్ వ్రాసుకోవడం అలవాటు లేని వాళ్ళు, వాళ్ళజన్మలో ఒక్కదమ్మిడీ నిలవ చెయ్యలేరు. బాగుపడేవాళ్ళలక్షణం..."

ఏమిటనుకుంటున్నారేమిటి? అకవుంట్ వ్రాసుకోవడం. ఆయనచెప్పిన వాక్యాలలోని సత్యాసత్యాల విషయమై ఎక్కువగా ఆలోచించక, ఆయన్ని తృప్తిపరచడమే ప్రధానంగాఎంచుకొని, ఆనెలనుంచీ ఒకదొంగ అకవుంట్ తయారుచేసి పంపుతూవుండేవాణ్ణి. నాకు బాగుపడేలక్షణాలు అబ్బుతున్నాయని చాలా సంతోషించారాయన. కాలేజీకోర్సు పూర్తిఅవగానే ఆ అకవుంట్ బాధ తప్పింది.

నాటికి నేడు.

"మీరు ఉద్యోగంలో ప్రవేశించి మూడేళ్ళయింది. ఒక్కరాగిదమ్మిడీ అయినా నిలవలేదు సరిగదా పదిహేనో తారీఖు దాటినప్పట్నుంచీ తోడిగుమాస్తాల్ని అప్పుకోసం వేధించుకుతినటం అలవాటయింది."

అవును. అప్పుచెయ్యడం నాకు అలవాటైపోయింది. 'అప్పు చేయుట తప్పు' అని ఎలిమెంటరీ స్కూలులో నా చిన్నతనంలోనూ ఎవరో మేష్టరు నాక్కూడా చెప్పేవుంటాడు. కాని అప్పుడు తప్పులు అని అనుకొన్నవన్నీ యిప్పుడు ఒప్పులుగా భావిస్తున్నాం కాదూ!

నాకు నాపై అధికారులు నెలకి 70 రూపాయలు ముట్టచెప్తున్నారు. నెలకి 70 రూపాయలచొప్పున సంవత్సరానికి ఎంతయింది? 840 రూపాయిలు. మూడు సంవత్సరాలకి 2420 రూపాయిలు. ఆ పొరబడ్డానా? అవునండోయ్- 2400 రూపాయిలు కాదు, 2520 రూపాయలు. నేను హిష్టరీస్ వాణ్ణండీ! నాకు లెఖ్ఖలు బొత్తిగా రావు.

2420, కాదు, కాదు, 2520 రూపాయలు. నేనూ శాంతా అవన్నీ సునాయాశంగా ఖర్చు పెట్టేశాం. ఖర్చు పెట్టడంలో ఒకర్ని ఒకరం తీసిపోం. కాని మా ఇద్దరిలో ఎవరు ఎక్కువ ఖర్చుచేస్తారనేది ఒక సమస్యే! అనాది నుంచీ స్త్రీ పురుషుడికి ఎలాటి సమస్య అయిందో యిదీ అంత సమస్యే! నేను ఎక్కువ వ్యయం చేస్తానంటుంది శాంత. ఆమె చాలా దుబారా ఖర్చులు చేస్తుందని నా నమ్మకం. ఈ విషయమై ఆమెతో నేనెప్పుడూ వాదించలేదు. ఎంచేతనంటే, ఆడదానితో వాదన చాల ప్రమా

దకరమైన వ్యవహారమని నా అనుభవాలు నాకు ఎన్నో సార్లు చెప్పాయి.

ప్రస్తుతానికి వద్దాం.

"డెబ్బయి రూపాయిలూ ఎలా ఖర్చు చేశావో నాకేం తెలుస్తుంది? ఈనెల మరీ ఘోరంగావుంది. ఇవ్వాళ యింకా పదిహేనే!" అన్నాను. ప్రతినెలా సొంతఖర్చు కని పది రూపాయిలు నా దగ్గిర వుంచుకొని మిగతా అరవై ఆమెచేతిలో పెట్టడం రివాజు. ఇద్దరం ఖర్చుపెట్టడం అలవాటు.

"గతనెలలో మీరు చేసిన అప్పులు యిరవై రూపాయిలు. మీ సొంతఖర్చుకని తీసుకొన్నవి పదిరూపాయిలు. మిగిలినవి నలభయ్యే కాదూ!"

నలభైరూపాయిలు శాంత దృష్టిలో అంత తేలికగా కనిపిస్తున్నాయి- ఈ కరువురోజుల్లో. నెలకి నలభై రూపాయిలతో నాలుగు సంసారాలు ఈడేవాళ్లు వున్నారు. కాని నెలకి నాలుగువందలు వున్నా నేనూ శాంతా యిలాగే కష్టపడతామేమో!

"మనం ఖర్చు తగ్గించాలి."

శాంత అడిగింది చిటికినవేలు కొరుకుతుంటూ, "ఎలా?"

"నువ్వు అకవుంట్ వ్రాయి."

"వ్రాస్తే?"

"నువ్వు అకవుంట్ వ్రాస్తూవుంటే మనం నిలవ చెయ్యవచ్చు."

'ఇదిసాధ్యమా!' అన్నట్లు శాంత తెల్లబోతూ చూసింది.

"మానాన్నగారు చెప్పారు. అకవుంట్ వ్రాసు కుంటూ వుంటే మనం నిలవ చెయ్యగలం."

"అలాగా!" అంటూ శాంతా దేవి ఆలోచిస్తోంది. ఇంతట్లో మధ్యాహ్నం కాఫీకిగాను అలమారులో భద్ర పరిచిన పాలు తాగాలని ప్రయత్నంచేస్తున్న పిల్లిపిల్లనికొట్ట డానికి వంటింట్లోకి పరుగెత్తింది.

ఎలాఅవుతేనేం నిశ్చయించుకున్నాం, — అక వుంట్ వ్రాయడానికి. నేను ప్రొప్రయిటర్ని, శాంతా దేవి అకవుంటెంట్ అండ్ కాషియర్. ఆమె వ్రాస్తుంది-నేను అజమాయిషి చేస్తూవుంటాను.

గడిచినరాత్రి వెంకట్రావుదగ్గిర అప్పుగా పుచ్చు కొన్న పదిరూపాయిలలోనూ, సినీమాకి సినీమాకోను ఖర్చుపెట్టగా మిగిలిన ఎనిమిదిరూపాయిలలో పన్నెండు అణాలు వెచ్చించి అందమయిన అకవుంట్ పుస్తకం ఒకటి కొన్నాం. పుస్తకం కొనడం దగ్గర కూడా కొద్దిగా పేచీ పడ్డాం. పేచీ పడడమే నా వంతు గాని పంతం నెగ్గించు కోవడం ఆమె వంతే. మూడణాల పుస్తకం కొనమంటాను నేను; పన్నెండణాల పుస్తకం కొందాం, పది కాలాల పాటు వుండవద్దా!—అంటుందామె. చివరికి పన్నెం డణాల పుస్తకమే శాంతా దేవి మృదువైన చేతివేళ్ల మధ్య నుంచుని, నన్ను చూసి వెటకారంగా నవ్వింది.

"ఇంకా ఏవయినా కావాలా?" అని సగౌర వంగా షాపువాడు అడిగాడు.

ఫేవిూ అక్కర్లేదని తల పంకిస్తూ, బిల్లు చెల్లించ బోతూ వుండగా శాంతాదేవి "ఫవుంటెన్ పెన్!" అంది. అని ప్రశ్నార్థకంగా నా మొహంలోకి చూసింది.

మళ్లీ నెలలో కొనుక్కోవచ్చునని శాంతని సమాధానపరుస్తున్నాను. కాని ఆ షాపువాడు వూరుకుంటేనా! యమకింకరుడిలా పోగయాడు నా పాలిట! అరనిముషంలో రెండుడజనుల ఫవుంటెన్ పెన్ పెట్టెలు తీసుకు వచ్చి శాంతాదేవి ముందు పడేశాడు. అన్ని కొత్తవస్తువులు ముందు మెరమెర మెరిసిపోతూవుంటే—శాంత—ఈ పాత మొగుడి వంక చూస్తుందీ! నిజంగా ఆడదానితో ఫాన్సీషాపులోకి వెళ్లడం చాలా బుద్ధితక్కువపని.

కర్మయోగిలా ఆమె సెలక్షన్ చూస్తున్నాను. ఒక గ్రోసు ఫవుంటెన్ పెన్నులలో రెండు మాత్రమే ఆమెకి నదరుగా కనిపించాయి.

"ఈ పెన్ బావుందా?" అంటూ ఒక ఫవుంటెన్ పెన్ చూపించింది.

"ఊఁ!" అన్నాను.

ఎర్రరంగులో వున్న పెన్ ఒకటి తీసి యిందాకటి ప్రశ్నే వేసింది.

నేను మళ్లీ "ఊఁ!" అన్నాను.

"ఈ రెంటిలో ఏది బావుంటుందో చెప్పండి."

"రెండూ బాగానే వున్నాయి."

"రెండిటిలోనూ ఏది అందంగా వుంది?"

"రెండూ అందంగానే వున్నాయి."

"చెప్పరూ?" అంది ఘట్టిగా. నవ్వుతే సొటలు

పడే ఆమె చెక్కిళ్ల అందానికి దాసుడనై పోయి, నవ్వుతూ, ఆకు పచ్చ ఫవుంటెన్ పెన్ మీద నా అభిమానం చూపించాను.

బతికి బయట పడతాననుకొన్నాను. కాని, ఆ షాపువాడు నన్నూ శాంతనీ తనషాపులోని వస్తువులన్నీ కొనేదాకా వదిలేటట్టు లేడు. నేనేమయినా జమీందారు ననుకొన్నాడో, ఏమో!

"ఇంక్ వద్దమ్మా? కలర్స్-ఆర్...బ్లూ బ్లాక్?"

శాంత అడిగింది, "వైలట్ వుందా?"

"వైలట్ కళ్ళకి జబ్బుచేస్తుంది," అన్నాను,—అందామని అనుకోకుండానే!

"మన పక్కింట్లో వుంటున్న ఎడిటర్ గారి భార్య వైలట్ యింకే వాడుతుంది," అంది శాంత.

ఇంక అపీలు వుందీ! ఎడిటర్ గారి భార్య వాడితే తిరుగు వుందీ! నేనింకేమీ మాట్లాడ దలచుకోలేదు. ఆడది పట్టే మూగినోము మొగాణ్ణి అయిన నేను పట్ట వలసి వచ్చింది.

ఒక బ్లాటింగ్ పేపరు పీటుతోనూ, ఒక దస్తా కాగితాలతోనూ, ఒక వైలట్ యింక్ బాటిల్ తోనూ శాంతాదేవి పేరు చెక్కిన ఫవుంటెన్ పెన్ తోనూ, మూల కారణమైన అకవుంటబుక్ తోనూ చైనాబజారు అడ్డంగా దాటి బస్సు ఎక్కాం.

జూన్ పదిహేడో తారీఖు సాయంత్రం ఆరున్నరకి ఈ హడావిడి అంతా జరిగినా, జూలై మూడో తారీఖుదాకా కొత్తపుస్తకంలో 'శ్రీరామా' పెట్టదలు

చుకోలేను. జూలై ఒకటో తేదీ పబ్లిక్ హాలీడే. రెండు ఆదివారం. రాబడి మూడో తారీఖువరకూ వుండదు. అప్పుతో అకవుంట్ ఆరంభించడం అశుభసూచకం. మేమిద్దరమూ ఏకీభవించడమనేది చాలా అరుదు. మా యిద్దరి వ్యవహారమూ హిందూమహమ్మదీయ సమస్య లాటిది. కాని, ఒక్క అకవుంట్ బుక్కు విషయంలో మాత్రం మేమిద్దరమూ ఆర్మానించుకొన్న నిర్ణయం ఒక్కటే అయిందని లోకానికి వెల్లడించేందుకు నేను చాలా గర్విస్తున్నాను.

మూడో తేదీ సాయింత్రం బరువైన పర్సుతోనూ ఉత్సాహంతో కుప్పిగంతులేస్తున్న మనస్సుతో నేను యిల్లు చేరుకోనేటప్పటికి, "యివ్వాళ సినీమాకివెళ్దా మండోయ్!" అంది శాంత. ఇంకా అనేక కారణాల వల్ల నాలుగో తారీఖు రాత్రి ఎనిమిది గంటలవరకూ కొత్త అకవుంట్ పుస్తకానికి శాంతాదేవి చేతిముత్యాల్ని అనుభవించే యోగ్యత లేకపోయింది.

రాబడి కాలములో జమ రూ 70 అని వ్రాసింది. ఖర్చు కాలములో భర్తగారి సొంత ఖర్చులకి పది రూపాయలు.

శాంతనిఅడిగాను: "అన్నిఖర్చులలోనూ యిదే నీకు మొట్టమొదట స్ఫురించిందా?"

శాంత చిరునవ్వు నవ్వింది. ఆచక్కటినవ్వులో స్త్రీ లోని చిలిపి తనమంతా మూడుమూర్తులా మూర్తీభ వించింది.

సినీమాసాదరూ, పాలవాడి బాకీ, దాసీదాని

జీతమూ మొదలైన ఖర్చులన్నీ ఖర్చుకాలమ్‌లో నిండుగా వున్నాయి. జమకాలములో ఒకే ఒక్క ఐటమ్ రాబడి బోసినోటిలో అన్నిపళ్ళూ రాలిపోగా మిగిలిపోయిన ఒక్క పన్నులావుంది. అంతఅందమయిన అకవుంట్ పుస్తకంలోనూ జమకాలములో నెలకి ఒక్కసారే అంకె పడుతుందన్న దుర్భర విషయం నామీద నాకేజాలిగొలిపింది.

కాని, ఒక్క అపూర్వరహస్యం. ఆడపిల్ల అకవుంటు మెయిన్ టెయిన్ చెయ్యడంలో కూడా రొమాన్సు వుంది సుమండీ!

రాత్రిభోజనాలైపోయిన తర్వాత ఈ కళేబరాన్ని మంచం మీద పారేసి, నాకు యింక్రిమెంటు ఎప్పుడు వస్తుందాఅని నేనుయోచిస్తూవుండేవేళ వయ్యారంతో లోలకులు ఆడించుకుంటూ, పైటసర్దుకుంటూ కాగితంచినిగిపోతుందేమో, పెన్ను అరిగిపోతుందేమో, చెయ్యికందిపోతుందేమో అన్నంత సుకుమారంగా వ్రాస్తూ, స్త్రీలోని చిత్త చాంచల్యాన్ని తెలిపేందుకా అన్నట్లు తల అల్లలలాడిస్తూ, "ఏమండీ, యివ్వాళఏమేం ఖర్చులుచేశామండీ!" అని ఆమె నన్నుఉద్దేశించి అడగడమూ, ఆ అమృత వాక్కుల్లోని మాధుర్యాన్ని గ్రహించక యింక్రిమెంటు బాధ పడుతున్న నేను మొరటుగా ఆఫ్రికాలో పుట్టి పెరిగిన వాడిలా "నాకేం తెలుసు!" అని జవాబివ్వడమూ, ఆమెకి కోపం...అది సాధారణ కోపమూకాదు...అసాధారణ కోపమూ కాదు...ప్రణయకోపం....అదంతా ఒకఫార్సు.

ఈ ప్రకారంగా పదిహేను రోజులు గడిచాయి. డబ్బుపూర్తిగాఅయిపోయింది. వెంకట్రావు దగ్గిరికి భిక్షాటనకి బయలుదేరాను. భగవంతుడి ధర్మమా అంటూ కొందర్ని నిలవచేసేవాళ్ళుగానూ, కొందర్ని ఖర్చు చేసేవాళ్ళుగానూసృష్టిస్తాడు. అందర్నీనాలా ఖర్చుచేసేవాళ్ళుగానే సృష్టించివుంటే ఈసృష్టిఎప్పుడో ఆగిపోయివుండేది పెట్రోలు అయిపోయిన మోటారు బస్సులా. అకవుంట్ పుస్తకంలో జమకాలమ్ నేననుకొన్నంత బోసిగా లేదు. పదిరూపాయిల అప్పుతో విరాజిల్లింది.

రెండునెలలు గతించేటప్పటికి అకవుంట్ పుస్తకంలో గొప్ప పరివర్తన కలిగింది. తరుచుగా—చారులో ఉప్పు వెయ్యడమూ, కాఫీలో పంచదార కలపడమూ మర్చిపోయే శాంత చేసిన ఖర్చులన్నీ జ్ఞప్తిలో వుంచుకోగలదా? కాని, అకవుంట్ మెయిన్టెయిన్ చెయ్యడం విషయంలో మాత్రం ఆమె చాలా శ్రమపడిందనే చెప్పాలి. ఖర్చులన్నీ స్ఫురణకి తెచ్చుకొని ఎంతో వివేకంతో వాటిని రికార్డు చేసేది. అంతకీ కొన్ని ఖర్చులు ఆమె జ్ఞాపకశక్తికి అందకుండా లేడిపిల్లలలా పరిగెత్తేవి. ఏం చేస్తుంది, పాపం!

తుడుపులూ, వ్రాసినఖర్చులే పొరపాటున మళ్ళీ వ్రాయడాలూ కొట్టివేతలూ మొదలైన ఘోరాలన్నీ జరిగేవి. ఒకరోజున సీతాబాయమ్మగారి రెండో కుర్రాణ్ణి చంకలో పెట్టుకొని అకవుంట్ వ్రాస్తూవుండగా, ఆకొంటె వెధవ —కాలికో అట్టతో ధగధగ లాడుతున్న ఆ పుస్తకరాజం ఏదో పెద్దరకం చాక్లెట్ అనుకొన్నాడు.

కాబోలు- అంత పుస్తకాన్నీ కబళించే ప్రయత్నంలో రెండుచేతుల్తోనూ పట్టుకోగా శాంతాదేవి విదళించింది. దాంతో పదికాగితాలు ఫర్రున చినగడం సంభవించింది. ఒక అమావాశ్యనాడు వర్జఘడియలలో శాంతాదేవి చెయ్యి టేబుల్ మీద హుషారుగా వున్న సిరాబుడ్డికి తగలగా, ఆ సిరాబుడ్డి పుస్తకానికి సిరాస్నానం చేయించింది. ఈ విధంగా ఆ పుస్తకం యిప్పుడు రూపు మారిపోయినదై, పేజీలు పోగొట్టుకొన్నదై, ముఖ్యములైన జమాఖర్చులు మాత్రమే కలిగినటువంటిదై ఆంధ్ర మహావైభవాన్ని సూచించే హంపీశిథిలాలని జ్ఞాపకం చేస్తోంది.

ఈ అకవుంట్ బాధ వల్ల లాభమూ కనిపించలేదు, నష్టమూ కనిపించలేదు. జీతం వచ్చేటప్పటికి పదిహేను రూపాయిల అప్పు అలాగే వుంటూ వుండేది. ఎటొచ్చీ కొత్త అకవుంట్ బుక్ కొనాలనే ప్రయత్నంలో వుంది శాంత.

ఒక రోజు సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే పట్టలేని సంతోషాతిశయంతో అన్నాను, "శాంతా, నాకు పదిహేను రూపాయలు యింక్రిమెంటు యిచ్చారు."

ఆమె నవ్వుతూ అంది, "అయితే మనం యింకో అకవుంట్ పుస్తకం కొనవలసిన పనిలేదు."

"ఏం?"

"ఈ పదిహేనురూపాయిలూ నిలవేగా!"

"మనం ప్రతి నెలా పదిహేనురూపాయిలు అప్పు చేస్తున్నాంగా!"

"ఈ నెలనుంచి అప్పు చెయ్యవలసిన అవసరం వుండదు. ఎంచేతనంటే, మనకి ప్రతి నెలా పదిహేను రూపాయలు ఎక్కువగా వస్తాయి!"

"అనగా!" అన్నాను, నవ్వుతూ.

"అరటికాయ ముక్కలు మాడిపోతున్నాయి," అంటూ వంటింట్లోకి దూకింది శాంత.

"నిలవ చెయ్యడం?" అన్నాను. ఆమె వినిపించుకో లేదు. గాలిలో కలిసిపోయాయి ఆ మాటలు.

రచన: జూన్ 1939–ముద్రణ: 'భారతి'–అక్టోబరు 1939

---